
ప్రమాదం బాస్!



చిత్తూరు-పీలేరు జాతీయ రహదారిపై కల్లూరు సర్కిల్లో మామిడికాయల ట్రాక్టర్పై కూలీల ప్రయాణమిది. పీలేరు, రొంపిచెర్ల, సదుం, సోమల, పులిచెర్ల, కేవీపల్లె తదితర మండలాల నుంచి నిత్యం మామిడికాయల లోడుతో వందల ట్రాక్టర్లు దామలచెరువు మండీలకు వెళుతుంటాయి. మామిడికాయల సీజన్ మొదలైనప్పటి నుంచి సీజన్ ముగిసేవరకు దామలచెరువులోని మండీలకు వెళ్లే ట్రాక్టర్లు కల్లూరు ఘాట్‌రోడ్డు మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. అయితే మామిడికాయలతో వెళుతున్న ట్రాక్టర్లు ఘాట్‌రోడ్డులో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.అనేక మంది కూలీలు గాయపడగా, కొంతమంది మృత్యువాత కూడా పడిన సందర్భాలున్నాయి. ట్రాక్టర్ ట్రాలీలపై ప్రయాణం ప్రమాదమని చెబుతున్నా డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. జ్యూస్ ఫ్యాక్టరీలు తెరిస్తే మరింత జోరందుకోనున్న ఈ ట్రాక్టర్ ట్రాలీల ప్రయాణాలపై పోలీసులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనావుంది.

- కల్లూరు, ఆంధ్రజ్యోతి

మందుబాబు ఆన్ డ్యూటీ!



పలమనేరులోని గుడియాత్తం క్రాస్ వద్ద నాలుగురోడ్ల కూడలిలో ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న మందుబాబు

పలమనేరులో శుక్రవారం మద్యం మత్తులో ఓ యువకుడు ట్రాఫిక్ పోలీసు అవతారం ఎత్తాడు. పట్టణంలోని గుడియాత్తం క్రాస్ వద్ద నాలుగురోడ్ల కూడలి మధ్యలో ఉదయం 11 గంటల ప్రాంతంలో 15నిమిషాలు ట్రాఫిక్ సిగ్నల్స్ ఇచ్చాడు. మఫ్టీలో ఉన్న ట్రాఫిక్ పోలీసేమో అని కొందరు అనుమానించి దగ్గరగా వెళ్లి చూసి మందుబాబు అని తెలిసి విస్తుపోయారు. ఈ కూడలిలో సాధారణంగా ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు ఓ కానిస్టేబుల్ వుంటారు. అయితే ఆ కానిస్టేబుల్ లేని సమయంలో ఇలా జరగడంతో స్థానికులు విస్తుపోయారు.

- పలమనేరు, ఆంధ్రజ్యోతి

ఆగిన టమోటా కోతలు




సోమల - కందూరు రోడ్డు పక్కనే పారబోసిన టమోటాలివి.టమోటా సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రోడ్డుపైనే పారబోస్తున్నారు. శుక్రవారం 15కిలోల బాక్సు మొదటి రకం రూ. 60 మాత్రమే పలికింది. రెండో రకం టమోటాలు రూ. 30 లోపు పలికాయి. మూడో రకం టమోటాలైతే మార్కెట్‌కే తీసుకురావొద్దని మండీ యజమానులు చెప్పడంతో పొలాల వద్దనే వదిలేస్తున్నారు.కొంతమంది పశువులకు మేతగా వేస్తున్నారు. టమోటా దిగుబడులు ఎక్కువై పోవడంతో మండీల్లో ఖాళీ బాక్సులు కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. సోమల మండలం నుంచి పలమనేరు, పుంగనూరు మార్కెట్లుకు టమోటా బాక్సుకు రవాణా ఖర్చులే రూ.20 అవుతాయి. మండీ యజమానులు కమీషన్ 10శాతం వసూలు చేస్తున్నారు. కోత కూలీ మరో రూ.10 అవుతుంది. పెరిగిపోతున్న ఖర్చులతో, దిగుబడులెక్కువై తగ్గిపోతున్న ధరలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో చాలామంది కోతలు ఆపేశారు. ఎండ వేడిమికి టమోటాలు పెద్దఎత్తున మాగిపోవడంతో గత్యంతరం లేక మార్కెట్‌కు తీసుకొచ్చి తెగనమ్ముకోవాల్సి వస్తోందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-సోమల, ఆంధ్రజ్యోతి



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, కలెక్టర్ సుమిత్‌కుమార్



మెగా యోగా

- చిత్తూరులో 4వేలమంది ఉద్యోగులతో ఆసనాలు

చిత్తూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్య రక్షణలో యోగాది కీలకపాత్ర. అందువల్ల అందరూ యోగా చేయాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం చిత్తూరులోని ప్రశాంత్‌నగర్ వద్ద ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4వేలమందితో మెగా యోగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రోజూ యోగా చేయడం ద్వారా మెడికల్ ఖర్చులు ఉండవన్నారు. యోగా విశిష్టత తెలియజేయడానికి జిల్లా వ్యాప్తంగా ఆరు కార్యక్రమాలు చేపట్టామన్నారు. చిత్తూరు, కాణిపాకంలో రెండు యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మిగిలినవి పెనుమూరులోని పులిగుండు, చౌడేపల్లెలోని బోయకొండ, కుప్పంలోని ననియాల, కంగుందిలో నిర్వహించనున్నట్లు వివరించారు. జూన్ ఒకటో తేదీనుంచి జిల్లాలో 500 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తారని, వీరిద్వారా జిల్లా వ్యాప్తంగా మరో 6వేల మందికి యోగాపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వీరంతా ప్రతి గ్రామంలోనూ యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు డీఎఫ్‌వో భరణి, డీఎంహెచ్ సుధారాణి, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి ఇతర అధికారులు కలిసి యోగాసనాలు వేశారు.

ఈత సరదాకు ఇద్దరు స్నేహితుల బలి







చిన్నారుల మృతికి కారణమైన కొత్తచెరువు - అభిలాష్, సిద్ధు మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

యాదమరి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈత సరదాకు ఇద్దరు స్నేహితులు బలయ్యారు. యాదమరి మండలంలోని కీనాటంపల్లె పంచాయతీ కోయివూరు గుట్టపై దళితవాడ గ్రామానికి సమీపంలో ఈ విషాద సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ తుమ్మిందపాళెం గ్రామానికి చెందిన సదా, ఉమా దంపతుల పెద్ద కుమారుడు సిద్ధు (11) ఆరో తరగతి చదువుతున్నాడు.తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలుకా పరదరామి మండలం సామిరెడ్డిపల్లెలో నివసిస్తున్న రాజ్‌కుమార్, రంజిత దంపతుల పెద్దకుమారుడు అభిలాష్ (13) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వేర్వేరు కుటుంబాలకు చెందిన వీరిద్దరూ వేసవి సెలవుల నేపథ్యంలో తమ అమ్మమ్మ వాళ్ల ఊరైన కోయివూరు గుట్టపై దళితవాడకు వచ్చేవారు. ఈక్రమంలో ఇద్దరూ స్నేహితులుగా మారారు. ఈ ఏడాది కూడా వేసవి సెలవులకు వచ్చారు. సరదాగా ఈత కొట్టడానికి గ్రామానికి సమీపంలో ఉన్న కొత్త చెరువు వద్దకెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇద్దరూ చెరువులోకి దిగారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోయారు. గట్టుపై ఉన్న సిద్ధు సోదరుడు సంజు ఈ ప్రమాదాన్ని గమనించి పరుగున గ్రామంలోకి వెళ్లి కుటుంబీకులు చెప్పాడు. వారొచ్చి చెరువు నుంచి ఇద్దరినీ బయటకు తీయగా, అప్పటికే చనిపోయి ఉన్నారు. ఈ సంఘటనతో విషాదఛాయలు అలుముకున్నాయి. యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఈ విషాద సంఘటనపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా తహసీల్దార్ పార్థసారథిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.





ఎస్ఏలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖాధికారులు - పదోన్నతుల కోసం వేచివున్న టీచర్లు

ఎస్ఏలకు ముగిసిన పదోన్నతులు

- 186మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ప్రమోషన్

చిత్తూరు సెంట్రల్, మే 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల దాకా బదిలీల, పదోన్నతి ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం రాత్రి 9.30 గంటలకు చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ శుక్రవారం వేకువ జామున 3 గంటల వరకు సాగింది. 186 మందికి స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది.జడ్పీ యాజమాన్యంలో 155 పోస్టులకుగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. వీరితో సహా 155 మందికి పదోన్నతులు లభించాయి. 25 మంది టీచర్లు నాట్ విల్లింగ్ ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 12 మంది, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏడుగురికి పదోన్నతి లభించింది. ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్, నాగరాజు, రాంకుమార్, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 12 మందికి కడప ఆర్జేడీ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరిగింది.

ఒక్క రోజు హెచ్‌ఎంలుగా ముగ్గురు టీచర్లు

ఒక్క రోజు హెచ్‌ఎంలైన వారిలో ముగ్గురు టీచర్లున్నారు. ఈ ముగ్గురు శుక్రవారం ప్రస్తుతమున్న స్థానంలో రిలీవై, శనివారం ఉదయం కొత్త చోట జాయినై గ్రేడ్-2లుగా పదోన్నతి పొందుతారు.అదే రోజు సాయంత్రం రిటైర్ కానున్నారు. మిగిలిన వారు శనివారం ప్రస్తుతమున్న స్థానంలో రిలీవై, జూన్ 1న ఆదివారం కొత్త చోట జాయినై గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందుతారు.వీరిలో కుప్పం ఎంపీపీఎస్ నుంచి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కె.వి.శ్రీదేవి పదోన్నతిపై గుండ్ల్యాయనివారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.తిరుపతిలోని పద్మావతిపురం జడ్పీ హైస్కూలు నుంచి ఇంగ్లీష్ ఎస్ఏ టి.సుధారాణి పదోన్నతిపై పొన్నగూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వెళ్లారు. తిరుచానూరు సమీపంలోని ఓటేరు ఎంపీపీఎస్ నుంచి హెచ్‌ఎం ఎస్‌సుబ్రమణ్యం పదోన్నతిపై తిమ్మరాజుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.



కె.వి.శ్రీదేవి - టి.సుధారాణి

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒకరోజు ముందే శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలోని 2,63,776 మంది లబ్ధిదారులకు అవసరమైన రూ.112.73 కోట్లను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని, పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛను సొమ్ము అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషన్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం తీసుకోనివారికి సోమవారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయనున్నారు.

డీసీసీబీకి, విండోలకు త్వరలో కమిటీలు

చిత్తూరు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకుతో పాటు 75 సింగిల్ విండోలకు త్వరలో కమిటీలు ఏర్పడనున్నట్లు సమాచారం.డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర రెడ్డి నియామకం గురువారం జరిగింది. ప్రభుత్వం గత ఏడాది డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరిని నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు జూన్ నెల 26వ తేదీవరకు అమల్లో ఉంటాయి. అందువల్ల జేసీ స్థానంలో అమాస నియామకం వచ్చేనెల 27వ తేదీ నుంచి ఆరునెలల కాలానికి మరో జీవోను తర్వాత జారీచేస్తారు. సాధారణంగా డీసీసీబీ పాలకవర్గాన్ని అనధికార వ్యక్తులతో భర్తీ చేసేటప్పుడు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌తో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా నియమిస్తారు. వచ్చేనెల జారీచేయనున్న జీవోలో మాత్రం ఏడుగురితో పాలకమండలిని నియమించిన తర్వాత అమాస రాజశేఖర రెడ్డి పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. గత ప్రభుత్వ హయాంలో చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ఎం. రెడ్డెమ్మ తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలోనే తన పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. నాటి నుంచి గత ఆరు నెలలుగా డీసీసీబీ చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. నామినేటెడ్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు లేకపోవడంతో డిపాజిట్‌దారులు, సహకార సంఘాల సభ్యులు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేకపోయింది. గత పాలకవర్గం చేసిన ఆర్థిక తప్పిదాలపై సహకారచట్టం సెక్షన్-51 మేర విచారణ పూర్తయ్యింది. శనివారం విచారణ అధికారి అయిన డీఆర్వో మోహన్‌కుమార్ ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందించనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకున్నా ఉద్యోగులపై కేసులు పెట్టే అవకాశముందన్న సమాచారంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన అమాస రాజశేఖర రెడ్డి జూన్ మొదటి వారంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

థియేటర్లలో లోటుపాట్లపై నోటీసులు

చిత్తూరుకలెక్టరేట్,మే30(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సినిమా థియేటర్లలో రెవిన్యూ, పోలీసు, మున్సిపాలిటీ, అగ్నిమాపక శాఖలు బుధవారం తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే.థియేటర్లకు వెళ్ళి అక్కడి పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించి పాప్‌కార్న్, పిజ్జా, బర్గర్, కూల్‌డ్రింక్స్, స్వీట్‌కార్న్, సమోసా, పఫ్ వంటి తినుబండారాల ధరలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ, థియేటర్లలో సీట్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నట్లు కూడా గుర్తించారు.ప్రతి థియేటర్‌లో అధికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తేలింది. బి-ఫారం లైసెన్సు రెన్యువల్, అగ్నిమాపక, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖలు ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు గడువుందా? ముగిసిందా? ముగిసివుంటే వాటి రెన్యువల్స్ కోసం థియేటర్ యాజమాన్యాలు సంబంధిత శాఖలకు గతంలోనే దరఖాస్తు చేసుకున్నారా? లేదా? బి-ఫారం లేకుండానే థియేటర్లు నిర్వహిస్తున్నారా? అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలు (ఫైర్ సేఫ్టీ) వున్నాయా అనే విషయాలను తనిఖీల్లో గుర్తించారు. జిల్లా యంత్రాంగం ఇచ్చిన ప్రొఫార్మాలో ఆయా తహసీల్దార్లు తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లను నివేదిక రూపంలో ఆర్డీవోలకు అందజేశారు. ఆర్డీవోల నుండి కలెక్టరేట్‌కు శుక్రవారం నివేదికలు అందాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు ఉల్లంఘించిన థియేటర్ యాజమాన్యాలకు శుక్రవారం కలెక్టరేట్ అధికార వర్గాలు షోకాజ్ నోటీసులు జారీచేశాయి. మూడ్రోజుల లోగా సమాధానాలు ఇవ్వాలని అందులో సూచించారు. సోమవారంలోగా సమాధానాలు అందిన తరువాత వాటిపై జేసీ విద్యాధరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

పూదోటలో పట్టుబడిన జెర్రిపోతు



తిరుమలలోని టీటీడీ గార్డెన్‌లో శుక్రవారం జెర్రిపోతు పాము పట్టుబడింది. శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని టీటీడీ ఫ్లవర్ గార్డెన్‌లో ఆరు అడుగుల పొడవైన పాము ప్రవేశించింది. గుర్తించిన ఉద్యానవన సిబ్బంది పాములు పట్టే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఎల్ మురుగన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ వెంకటరావు, ఉత్తరప్రదేశ్ మంత్రి సంజయ్‌సింగ్, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, జనార్దన్‌రావు, నక్కా ఆనంద్‌బాబు ఉన్నారు. దర్శనానంతరం ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ మహాజాతరను తలపించేలా జరిగిన మహానాడు పసుపు పండగను చూసి శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన చంద్రబాబుకు పూర్తి ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మురుగన్ తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆనం రామనారాయణరెడ్డి

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి పార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,019

తలనీలాలు సమర్పించినవారు: 37,774



జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు

● జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్



మంగళం, మే 30(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కొన్ని రోజుల క్రితం జీవవైవిధ్య పరిశోధనలకు ఫుల్‌స్టాప్ అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పందించారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ శేషాచల జీవవైవిధ్య పరిశోధనలపై వచ్చిన కథనం తనను ఉత్సాహపరిచిందన్నారు. పరిరక్షణకు, పరిశోధనలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పరిశోధనశాలను మరమ్మతు చేస్తున్నామన్నారు. ముగ్గురు పరిశోధకులను, అవసరమైతే మరొకరిని నియమించి పూర్తిస్థాయి పరిశోధనలు జరిగేలా చూస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, అవసరమైతే అటవీ శాఖ సొంత నిధులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత, పరిశోధనలలో వచ్చే సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

మహిళకు లైంగిక వేధింపులు

● యూట్యూబర్ హేమాద్రితో పాటు మరొకరిపై కేసు నమోదు



హేమాద్రి

తిరుచానూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన యూట్యూబర్‌తో పాటు మరొకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మంగళం క్వార్టర్స్‌కు చెందిన కల్లూరి హేమాద్రి స్థానికంగా ఓ వివాహితను లైంగికంగా వేధిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా మెసేజీలు చేసి వేధించేవాడు. ఫొటోలు మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడు. రెండు రోజుల క్రితం హేమాద్రి తన సన్నిహితురాలు నాగవర్ధిని నివాసానికి ఆ వివాహితను రప్పించి బెదిరించాడు. దీంతో బాధితురాలు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హేమాద్రితో పాటు అతని సన్నిహితురాలు నాగవర్ధనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. హేమాద్రిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ ఇతనిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

భవిష్యత్తు అవసరాల కోసం..

● పాపవినాశనం, ఆకాశగంగ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆకాశగంగ, పాపవినాశనం, గదులు కేటాయించే సీఆర్వో(సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్) అభివృద్ధి, ఆధునికీకరణపై టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సమీక్షించారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి నిపుణులు రూపొందించిన ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈవో మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల పర్యావరణ, ఆధ్యాత్మిక అభివృద్ధికి రూపకల్పన చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సీఆర్వోను కూడా ఆధునికీకరించి, భక్తులు సులువుగా గదులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, అర్బన్ డెవలప్మెంట్ అండ్ డిజైనింగ్ నిపుణులు రాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పగాకు

ధూమపానంతో పెరుగుతున్న క్యాన్సర్ల ముప్పు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

'నా పేరు ముకేష్... ఒక సంవత్సరం గుట్కా నమిలాను... నోటి క్యాన్సర్ ఆపరేషన్ జరుగుతోంది, బహుశా ఇక నేను మాట్లాడలేపోవచ్చు...' ప్రతి సినిమా ప్రారంభానికి ముందు వచ్చే ఈ మాటలు అందరినీ ప్రభావితం చేస్తాయి. అనారోగ్య హేతువైన ధూమపానం ఎంత ప్రమాదకరమో.. దృశ్య రూపంలో వివరించి ఆందోళన కలిగిస్తాయి.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి





సరదాగా ప్రారంభించే ధూమపానం మానలేని వ్యసనంగా మారుతుంది. పొగాకులోని నికోటిన్, విషతుల్యాలు ఊపిరితిత్తులు, గుండె జబ్బుల వంటి దీర్ఘకాల వ్యాధుల దగ్గర నుంచి క్యాన్సర్ల వరకూ దారితీస్తాయని వైద్యులు చెబుతున్నారు. మన దేశంలో రోగాలకు, మరణాలకు కారణమవుతున్న ప్రధాన అంశాల్లో పొగాకు అలవాటు ఒకటి. మన జిల్లాలో 15, అంతకన్నా ఎక్కువ వయసు పైబడిన వారిలో సుమారు 30 శాతం మంది పొగ తాగుతున్నట్లు ఒక అంచనా. పొగాకు కారణంగా క్యాన్సర్ బారిన పడిన వారి సంఖ్య కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో దీని కారణంగా 1729 మంది క్యాన్సర్ బారినపడితే. 2024- 25(ఇప్పటివరకూ) ఆ సంఖ్య 2564కు చేరింది.

జిల్లాలో పొగాకు వల్ల క్యాన్సర్ బారిన పడిన వివరాలు..

సంవత్సరం	బాధితులు
2022-23	1729
2023-24	2335
2024-25 నేటి వరకు	2564

గుండెకు ప్రధాన శత్రువు

గుండెపోటు కేసుల్లో 25 శాతం వరకు పొగాకే కారణమవుతోందని భావిస్తున్నారు. సిగరెట్ల సంఖ్య పెరిగేకొద్దీ గుండెజబ్బు ముప్పూ పెరుగుతోందని డాక్టర్లు చెబుతున్నారు. రోజుకు 20 సిగరెట్లు కాల్చేవారితో పోలిస్తే ఒకటి రెండు తాగేవారికీ గుండెపోటు ముప్పు 40-50 శాతం తక్కువగా ఉంటుందంటున్నారు. పొగాకులో నికొటిన్, విషతుల్యాలు రక్తనాళాలను దెబ్బతీసి పూడిక ఏర్పడుతుంది. పూడిక చిట్లిపోతే రక్తం గడ్డకట్టి నాళం మూసుకుపోయి గుండెపోటుకు దారితీస్తుంది. పొగ మూలంగా పెదవి, నోరు, నాలుక, జీర్ణాశయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, కాలేయం, మూత్రాశయం, కిడ్నీ క్యాన్సర్ల వంటివెన్నో తలెత్తుతాయి.

చట్టం ఏం చెబుతుందంటే...

చట్ట ప్రకారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచార ప్రదేశాల్లో ధూమపానం నిషేధం. ఈ నిబంధన అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు జైలు శిక్ష అమలుచేస్తారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదు. విద్యాసంస్థలకు వంద గజాల్లోపు వీటిని అమ్మడం నిషేధం. గుట్కా, ఖైనీ, పాన్, జర్దా వంటి పొగాకు వినియోగించే వారిలో అత్యధికులు 13 నుంచి 15 ఏళ్ల వయసున్న వారే ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో తేలింది.

డ్రగ్స్ నియంత్రణకు సమన్వయం ముఖ్యం

విద్యాసంస్థలో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

తిరుపతి (కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో డిఆడిక్షన్ సెంటర్‌లో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఔషధనియంత్రణ అధికారులు సంయుక్తంగా మందుల దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 1972టోల్‌ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా చేసేవారి వారి ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. గంజాయి రవాణా హాట్ స్పాట్లను గుర్తించి నిఘా ఉంచామని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిషేధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కుమార్, ఆర్డీవో మురళీమోహన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధ, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం



విద్యార్థులతో శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షకులు

సత్యవేడు, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నలభై రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఏప్రిల్ 9 నుంచి ప్రారంభమైన శిబిరంలో 9వ తరగతితో పాటు టెన్త్, ఇంటర్ విద్యార్థులు 175 మంది హాజరయ్యారు. వీరికి స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు, రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెలకువలు, జనరల్ నాలెడ్జి తదితర అంశాలను బోధించారు. యోగా, టెన్నిస్ తదితర క్రీడల్లో తర్ఫీదునిచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్ క్షేత్ర పర్యటనలు, శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. శ్రీసిటీ సీఎస్సార్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ఈ కార్యక్రమాలను రూపొందించి మార్గనిర్దేశం చేశారు. కాగా వేసవి శిబిరానికి శిక్షకులుగా రజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), ఉమా, నేహా (వ్యక్తిత్వ వికాసం), సాయిలక్ష్మి (ఇంగ్లీష్), సౌమ్య (కంప్యూటర్ కోర్స్), కోదండం (యోగా, కరాటే) వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, శ్రీరామచంద్ర, మెడికల్ సెంటర్ డాక్టర్ సులోచన, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

నాయుడుపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. నాయుడుపేట మండలం కాలవగట్టు సమీపంలో నివాసం ఉంటున్న మాణికల శ్రీనివాసులు, ఆయన భార్య కృష్ణవేణి ఈనెల 17వ తేదీన కూలి పనుల కోసం చిట్టమూరు మండలం గునపాడుకు వెళ్లారు. సాయంత్రం పని పూర్తయ్యాక భార్యభర్తలు ఇద్దరూ కల్లుతాగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కృష్ణవేణి స్వర్ణముఖినదిలోకి దిగింది. అదే సమయంలో భర్త శ్రీనివాసులుతో చిన్నపాటి వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో శ్రీనివాసులు రాయితో తన భార్య ముఖంపై బలంగా కొట్టాడు. అప్పటికే ఆమెపై అనుమానం ఉండడంతో వదిలించుకోవాలని గొంతుపై కాలితో తొక్కి హతమార్చాడు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది పోలయ్య, దయాకర్, వెంకటేశ్వర్లును సీఐ అభినందించారు.

మేర్లపాక వద్ద టోల్‌గేట్ ప్రారంభం

ఏర్పేడు, మే 30(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం నేషనల్ హైవేస్ పీడీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నిబంధనల మేరకు వాహనాల వద్ద రుసుం వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి చౌకదుకాణాల్లో ఏర్పాట్లు

● రోజుకు 8గంటల పని వేళలు

● నెలలో మొదటి 15రోజులు అందుబాటులో

చిత్తూరు కలెక్టరేట్, మే 30(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత తిరిగి చౌకదుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులను అందించనున్నారు.ఇందుకు అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జూన్ నుంచి పకడ్బందీగా ఈ విధానాన్ని అమలు చేసేలా పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. నెలలో ఒకటి నుంచి 15వ తేదీవరకు చౌకదుకాణాలు పని చేయాల్సి ఉంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మొత్తం ఎనిమిది గంటలు పని వేళలుగా నిర్ణయించారు.



చౌడేపల్లె మండలం బత్తలాపురంలో చౌకదుకాణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడినవారికి ఇళ్ల వద్దే..

దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వారికి ఒకటి నుంచి ఎనిమిదో తేదీలోపు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులను విధిగా అందించే ఏర్పాటు చేస్తున్నారు. వీఆర్వో స్థాయి నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వరకు అవసరమైన ప్రత్యేక లాగిన్‌ను సిద్ధం చేశారు.

మండలం యూనిట్‌గా..

సరుకుల పంపిణీకి బాధ్యత డీలర్లదే కావడంతో అందుకు అనుగుణంగా కాటాలు, బయోమెట్రిక్, ఐరీష్‌ల పనితీరులో లోపాల్లేకుండా మరమ్మతులు చేస్తున్నారు. మండలం యూనిట్‌గా ఈ పనులు చేస్తున్నారు. ఈ పోస్ యంత్రాలను ఆధునికీకరిస్తున్నారు. దుకాణాల వద్ద సరుకుల నిల్వల స్థితిగతులు తెలిపే బోర్డులతోపాటు ఈసారి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటిద్వారా వినియోగదారులు ఫిర్యాదులతోపాటు సలహాలు, సూచనలను పౌరసరఫరాల అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. సరుకుల నిల్వలు, తదితర అంశాల పరిశీలనకు పలు యాప్‌లు సైతం అందుబాటులో ఉంచారు.

కొనసాగుతున్న మామిడి ధరల పతనం

చిత్తూరు సెంట్రల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి ధరల పతనం కొనసాగుతోంది. బేనీషా, అల్ఫోన్సో ధర మరింత పతనం కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట చేతికి వస్తుందో? రాదోనని రైతులు మరోవైపు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల పతనంలో చిత్తూరు మ్యాంగో మార్కెట్ యార్డు వెలవెలపోతోంది. శుక్రవారం మార్కెట్ యార్డులో టన్నుకు పలికిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి. బేనీషా రూ.10-20వేలు, పుల్లూర రూ.4-6వేలు, తోతాపురి (టేబుల్ రకం) రూ.12-రూ.14వేలు, అల్ఫోన్సో, మల్లిక, కాలేపాడ్ రూ.20-30 వేలు, ఇమామ్ పసంద్ రూ.50-60 వేలుగా ఉన్నాయి.

ఐదేళ్లు అధికారంలో ఉండి చిన్న పనీ చేయలేకపోయాం!

● మీ హయాంలో అయినా అభివృద్ధి చేయండి

● సూళ్లూరుపేట ఎమ్మెల్యే ఎదుట వైసీపీ కౌన్సిలర్ల ఆవేదన

సూళ్లూరుపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): పాలకవర్గం ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. మా పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు చిన్న పని కూడా చేయలేకపోయాం.. కనీసం మీ హయాంలోనైనా మున్సిపాలిటీని అభివృద్ధి చేయం డమ్మా... అంటూ వైసీపీకి చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మొత్తం 30 అంశాలపై చర్చించారు. 28అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ముందుగా 8వ వార్డు కౌన్సిలర్, టీడీపీ నేత ఈదూరు చెంగమ్మ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో రోడ్లు సక్రమంగా లేదని, ఈ విషయాన్ని ప్రతి సమావేశంలో ప్రస్తావిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే 9 వార్డు కౌన్సిలర్, వైసీపీ నాయకురాలు కదూరు లక్ష్మమ్మ మైక్ తీసుకుని నాలుగేళ్ల నుంచి ఏమి అభివృద్ధి జరిగింది.. ఏదైనా సమస్య చెబితే అధికారులు వస్తారు.. కొలతలు వేస్తారు... మళ్లీ దాని గురించి పట్టించుకోరు.. కనీస డ్రైనేజీ కూడా సక్రమంగా లేదు.. అధికారంలోకి ఉండి కూడా ప్రజలు అడిగిన పనులు చేయకపోయాం... మేమెందుకు కౌన్సిలర్లుగా ఉన్నామో మాకే అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కో ఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్ కుమార్‌రెడ్డి జోక్యం చేసుకొని సభ్యులు చెప్పిదంతా నూటికి నూరుశాతం నిజమేనని, వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో చిన్నపాటి పనులు కూడా చేయలేదన్నారు. వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్ల గురించి ఐదేళ్లుగా ప్రతి సమావేశంలో అడుగుతున్నా పట్టించుకోలేదని, ప్రజల ముందు తిరగలేకపోతున్నామని వాపోయారు. ప్రజలు మీపై నమ్మకంతో గెలిపించారు.. మీ ప్రభుతంలో నైనా మున్సిపాలిటీని అభివృద్ధి చేయండమ్మా... మేము పూర్తిస్థాయిలో సహకరిస్తాం.. అని సునీల్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి విజ్ఞప్తి చేశారు. వైసీపీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కొన్నివార్డుల్లో పనులు ఆగిపోయాయని, దానికి గత ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. వైసీపీకి చెందిన 18 వార్డు కౌన్సిలరు జనార్దన్ జోక్యం చేసుకుంటూ కాంట్రాక్టర్లు ఎందుకు పనులు చేయలేదని, ఐదేళ్ల నుంచి ఇదేపాట పాడితే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. అసలు ఏవైనా పనులు చేసివుంటే కదా చెప్పుకోవడానికి, ప్రజల ముందుకెళ్లేందుకు సిగ్గుగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ కౌన్సిలర్ల నడుమ కొంతసేపు వాదనలు జరిగాయి. వారిని సముదాయించేందుకు చైర్మన్ ప్రయత్నించినా.. ఇంకో ఐదు నెలల్లో పదవీకాలం ముగుస్తుంది.. ఇక చేసేదే ముంది... తమ రాజకీయ జీవితం అంతా నాశమైపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో శ్రీమంత్‌రెడ్డి తలపట్టుకున్నారు. ఇంతలో వైస్‌చైర్మన్ చిన్నసత్యనారాయణ, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి సమావేశం నుంచి వెళ్లిపో తుండడంతో ఇదేం పద్ధతి అంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో రూ2 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడ తామని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో కమిషనర్ చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో కౌన్సిలర్ రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు సునీల్ రెడ్డి వాగ్వాదం



తలపట్టుకున్న మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, కమిషనర్ చిన్నయ్య

ఎయిర్‌పోర్టు భూముల సర్వే పరిశీలన

రామకుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రామకుప్పం మండలంలో జరుగుతున్న భూముల సర్వేను కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. మండల పరిధిలోని కిలాకిపోడు, విజలాపురం ప్రాంతాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్టు పనులు త్వరలో పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయని, సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేపై ఆర్డీవో శ్రీనివాసరాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కౌలేష్, డీటీ బాలాజీ, ఇతర సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గంజాయి అక్రమంగా విక్రయించేందుకు వేచియున్న నలుగురిని శుక్రవారం అరెస్టుచేసి, వారివద్దనుంచి రెండుకేజీల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. పలమనేరు సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద గంజాయి విక్రేతలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ స్వర్ణతేజ, డిప్యూటీ తహసీల్దార్, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లారు. అక్కడ అనుమానాస్పద స్థితిలో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారివద్ద ఉన్న రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టుచేసినట్లు చెప్పారు. పట్టుబడిన వారు గంగవరం మండలం కొత్తపల్లికి చెందిన పి.రాజేంద్ర(34), పి.మోహన్(48), పలమనేరు మండలం సాంబారుపూర్‌కు చెందిన సి.మంజునాథ్(28), ఎం.కిషోర్ కుమార్(24) ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. అరెస్టుచేసిన నలుగురు ముద్దాయిలను రిమాండుకు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

మూడ్రోజులపాటు వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం నుంచి వరుసగా మూడ్రోజులపాటు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. చిత్తూరులో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది.

నగరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాజమ్మ



రాజమ్మ - డైరెక్టర్లు నాగభూషణం - జగన్నాథం - రవి - దీప - హేమావతి

విజయపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా విజయపురం మండలం మహారాజపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు డి.సుబ్రహ్మణ్యంరాజు సతీమణి రాజమ్మను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా నగరి మండలం ఎం.కొత్తూరుకు చెందిన రామమూర్తి, డైరెక్టర్లుగా నిండ్ర మండలం పాదిరికి చెందిన దీప, ఎంఎస్ఎంవీపురానికి చెందిన రవి, మేళబాకానికి చెందిన నాగభూషణం, మిట్టకండ్రిగకు చెందిన హేమావతి, నెట్టేరికి చెందిన జగన్నాథం, విజయపురం మండలం సామిరెడ్డికండ్రిగకు చెందిన నర్సింహులు, విజయపురం దళితవాడకు చెందిన అశోక్, గంగమాంబాపురానికి చెందిన గీర్వాణి, నగరి మండలం బుగ్గఅగ్రహారానికి చెందిన ఆదిమూలం శకుంతల, వేలావడి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేసులు, అడవి కొత్తూరుకు చెందిన సులోచన, నాగరాజకుప్పానికి చెందిన లక్ష్మి, మిట్టపాళెంకు చెందిన కన్నివేలును ప్రభుత్వం నియమించింది.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు


ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల (కాణిపాకం), మే 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. శుక్రవారం ఆలయంలో మహా కుంభాభిషేకం ఉండటంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ ఈవో పెంచకిషోర్ పర్యవేక్షించారు. భక్తులందరికీ దర్శనమయ్యేలా ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు కృషి చేశారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

గాలివానకు నేల కూలిన భారీ వృక్షం

ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు


ఎస్ఆర్ఆర్ కండ్రిగ వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

పాలసముద్రం, మే 30(ఆంధ్రజ్యోతి): గాలివానకు పాలసముద్రం మండలంలోని పళ్లిపట్టు - షోలింగర్ రహదారిపై ఎస్ఆర్ఆర్ కండ్రిగ వద్ద ఓ భారీ వృక్షం శుక్రవారం సాయంత్రం నేలకూలింది. ఆ సమయంలో రోడ్డుపై ద్విచక్ర వాహనంలో వెళుతున్న తమిళనాడులోని వంగనూరు పట్టణానికి చెందిన నేతాజీ(29)పై చెట్టు కొమ్మలు పడ్డాయి. ద్విచక్ర వాహనం ధ్వంసమవగా, హెల్మెట్ ధరించి ఉన్నా నేతాజీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి బాధితుడిని షోలింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరోవైపు రోడ్డుపై కూలిన వృక్షాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

జడ్పీలో 49 మందికి బదిలీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ)లో 49 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీఈవో రవికుమార్ నాయుడు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్లు 31 మంది ఉండగా, ఐదేళ్లు పూర్తయినవారు 15 మంది, రిక్వెస్ట్ పెట్టుకున్నవారిలో 15 మంది ఉన్నారు. టైపిస్టులు 18 మంది ఉంటే.. 9 మంది ఐదేళ్లు పూర్తయిన వాళ్లు కాగా, మరో 9 మంది రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు పెట్టుకున్నారు.

గ్రామాల్లో రైతులకు వీకేఎస్ఏ కార్యక్రమాలు

చిత్తూరు సెంట్రల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు తెలియజేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ (వీకేఎస్ఏ) కార్యక్రమాలు చేపట్టినట్లు జేడీ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. వ్యవసాయ, అనుబంధ శాఖల సమన్వయంతో శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమాలు జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. కరకంబాడి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జిల్లాలోని 15 మండలాల్లో రైతులకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. తొలి దశలో వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు, నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో సాంకేతిక యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, విత్తనాల ఎంపిక, శుద్ధి, తదితర అంశాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేస్తున్న రాయితీలు, ప్రయోజనాలను రైతులకు తెలియజేయనున్నట్లు వివరించారు.

మహానాడుకు వెళ్లొస్తూ టీడీపీ కార్యకర్త హఠాన్మరణం



సతీష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి - సతీష్ కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న టీడీపీ కార్యకర్తలు

చౌడేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటుతో టీడీపీ కార్యకర్త గురువారం రాత్రి మృతి చెందాడు.చౌడేపల్లె మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ బత్తలాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త సతీష్ (45) గురువారం ఉదయం కడపలో జరిగిన మహానాడు సభకు గ్రామానికి చెందిన కార్యకర్తలతో పాటు వెళ్లారు. బహిరంగ సభ అనంతరం కడప నుంచి తిరిగి వస్తుండగా సోమల మండలం కందూరు సమీపానికి బస్సు రాగానే సతీష్‌కు గుండెపోటు వచ్చింది. అక్కడ ప్రథమ చికిత్స అందించి చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి రాత్రి 12 గంటలకు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సతీష్ అంత్యక్రియలకు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. సతీష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సతీష్ మృతదేహానికి టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఇద్దరు బాలురకు కుక్క కాట్లు




గాయపడ్డ యషన్‌సాయి - మోహిత్

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో వీధి కుక్క స్వైరవిహారం చేయడంతో ఇద్దరు బాలురకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు... కల్లూరు - పుంగనూరు రోడ్డులో కాపురం ఉంటున్న నేమారామ్ కుమారుడు మోహిత్ (14), బాలాజీరావు కుమారుడు యషన్‌సాయి (11)పాఠశాలకు సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉన్నారు. గురువారం మధ్యాహ్నం మరి కొందరు చిన్నారులతో కలిసి ఇంటి సమీపంలో ఉండగా ఓ వీధి కుక్క వీరిపై దాడి చేసింది. ఈ దాడిలో మోహిత్ కాలుకు, యషన్‌సాయి చేతికి, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు చిన్నారులు దర్శన్, మోక్షితపై వీధి కుక్క దాడి చేయగా ఇరువురూ తృటిలో తప్పించుకున్నారు. గాయాలైన ఇద్దరు చిన్నారులు మొదటగా కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సదుం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు.

వీధి కుక్కల దాడులను నియంత్రిస్తాం : కల్లూరు పంచాయతీలో చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వీధి కుక్కలను నియంత్రిస్తాం. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆపరేషన్ డాగ్స్ పేరుతో వీధి కుక్కలు, కోతులను పట్టుకొని సుదూర ప్రాంతంలో సురక్షితంగా వదిలి పెట్టాం. కొంత కాలంగా కుక్కలు, కోతుల బెడద తగ్గిందనుకుంటున్న తరుణంలో మళ్లీ వీధి కుక్కల దాడులు మొదలయ్యాయి. త్వరలో వీధి కుక్కలను పట్టిస్తాం.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చిత్తూరులో భారీ వాన

దర్గా సమీపంలో చెట్టు కూలడంతో గాయపడ్డ ముగ్గురు

ఒకరి పరిస్థితి విషమం

చిత్తూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దర్గా సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఒకటి కూలింది. ఆ సమయంలో చిత్తూరు నుంచి పలమనేరు రోడ్డు వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్న యాదమరి మండలం గాండ్ల కొత్తూరుకు చెందిన నటరాజ్, ఏనుగుండ్లపల్లెకి చెందిన రత్నవేలుపై ఆ చెట్టు పడింది. అలాగే మిట్టూరుకు చెందిన యశ్వంత్ కూడా ఆ చెట్టు కింద ఉండటంతో అతడిపైనా కొమ్మలు పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో.. నటరాజు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. స్థానికులు, రెండో పట్టణ పోలీసులు కలిసి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించి.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను నియమించరా?


మీడియాతో మాట్లాడుతున్న షణ్ముగం

చిత్తూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని అపోలో యాజమాన్యానికి అప్పగిస్తే.. వారేమో పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆస్పత్రి సంరక్షణ, పోరాట కమిటీ సభ్యులు విమర్శించారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలిసి కో-ఆర్డినేటర్ షణ్ముగం మీడియాతో మాట్లాడారు. పేదలకు వైద్య సేవలు అందించడంలో అపోలో డాక్టర్లు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను నియమించకుండా అపోలో యాజమాన్యం విజ్ఞప్తిని ఎందుకు ప్రభుత్వం అంగీకరిస్తుందని ప్రశ్నించారు. దీనివెనుక పెద్ద కుట్ర ఉందని తాము గుర్తించామన్నారు. జూన్ 3వ తేదీన విచారణకు వస్తున్న కమిటీకి అపోలో యాజమాన్యం పదేళ్లుగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేస్తున్న ఘోరాలపై ఆధారాలను అందజేస్తామన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సంరక్షణ, పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా శోభారాణి, కో-ఆర్డినేటర్‌గా షణ్ముగం, కో-కన్వీనర్‌గా జయకుమార్, తొమ్మిది మందిని సభ్యులుగా ప్రకటించారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి ఆలయ మహాకుంభాభిషేకం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక, పండితులు - పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మే 30(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి ఉపాలయంగా ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేకాన్ని అర్చక, పండితులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు, వేద పారాయణం, మహా పూర్ణాహుతి జరిగింది. ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య మిథున లగ్నంలో మహా కుంభాభిషేకం, కళాకర్షణ, న్యాసం అనంతరం ప్రథమ దర్శనం, ప్రథమ కాల అర్చన, మహర్నివేద, బలి, మహా మంగళ హారతి, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో ముగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, జడ్పీటీసీ సుచిత్ర, ఈవో పెంచలకిషోర్, ఆలయ పునఃనిర్మాణ దాత అనిల్‌కుమార్ సతీమణి మాధురి, మాజీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, మణినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ జడ్పీటీసీ లత, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ సేవలు అభినందనీయం



శేఖర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, టీచర్లు, అధికారులు, నాయకులు

వెదురుకుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ సేవలు అభినందనీయమని విద్యాశాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్ రెడ్డి ప్రకాష్ అన్నారు. శేఖర్ శనివారం పదవీ విరమణ చేయనుండటంతో శుక్రవారం డైట్ కళాశాలలో ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు మాజీ డీవైఈవో ప్రభాకరరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్డి ప్రకాష్ ప్రసంగించారు.32 ఏళ్లపాటు వృత్తిలో అంకితభావంతో శేఖర్ పనిచేశారని కొనియాడారు. డైట్ అధ్యాపకుడిగా, పుత్తూరు డీవైఈవోగా, డిప్యూటీ డైరెక్టర్‌గా, ఉమ్మడి చిత్తూరు డీఈవోగా, తిరుపతి మొదటి డీఈవోగా, ప్రస్తుతం డైట్ ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలను అందించారని ప్రశంసించారు. అన్నమయ్య జిల్లా డీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాల్లో శేఖర్ వద్ద చదువుకున్నవారు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని తెలిపారు. అలాగే ఇతర దేశాల్లోనూ ఉపాధ్యాయులుగా స్థిరపడిన వారున్నారని చెప్పారు. రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ గీతానాథ్, రిటైర్డ్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు తదితరులు ప్రసంగించారు. అనంతరం శేఖర్ దంపతులను ప లువురు ఘనంగా స న్మానించారు. వీరిలో.. తిరుపతి డీవైఈవో బాలాజీ, మాజీ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గాజుల నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు ముత్యాలరెడ్డి, ఎస్ఎస్‌నాయుడు, వేణుగోపాల్, పీఆర్‌టీయూ నాయకులు బాలాజి, గురుమూర్తి, అపాస్ గిరిప్రసాద్, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, దామోదరం, సతీష్, బాలసుబ్రహ్మణ్యం, యుగంధర్, కేశవులు, గాజుల నిర్మల, డాక్టర్ కోటేశ్వర్, శంకరయ్య, బాబు, కిషోర్, కుమారి, హెచ్‌ఎంలు తదితరులున్నారు.

బోనమంద వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం


ఒంటరి ఏనుగు తొక్కేసిన టమోటా తోట

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద సమీప పొలాల వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించినట్లు మాజీ సర్పంచు వై.బాలాజీ నాయుడు తెలిపారు. గురువారం రాత్రి ఒంటరి ఏనుగు మంద నుంచి దారి తప్పి ఇతర ఏనుగులను గుర్తించే క్రమంలో ఘీంకారంతో విచ్చలవిడిగా మామిడి కొమ్మలను విరిసేందని రైతులు వాపోయారు. బోనమంద గ్రామ ప్రజలు గ్రామంలోకి ఒంటరి ఏనుగు రాకుండా మంటలు వేసుకొని కాపుకాశారు. బాలాజీ నాయుడి మామిడితోటలో మామిడి కాయలు రాలిపోయి తీవ్ర నష్టం జరిగింది. ఆ సమీప టమోటా తోటల్లో ఊతంగా నాటిన కర్రలను తొక్కివేసి పంట నష్టం చేసింది. నష్ట పరిహారం పొందేందుకు పొలం వన్‌బీ కూడా ఆన్‌లైన్‌లో లాక్‌లో ఉందని వాపోయారు. గత ప్రభుత్వం పలువురు రైతుల వన్‌బీలు రాకుండా తహసీల్దార్ కార్యాలయంలో లాక్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఆందోళ వ్యక్తం చేశారు. మామిడి, టమోటా సీజన్‌లో కోతలు చేయాల్సిన వేళ ఏనుగు మంద సంచారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటవీ శివారుల్లో తోటలు ఉండడంతో అటు వైపు వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా అటవీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీకి పాడెకట్టే దినంగా జూన్ 4ని ప్రజలు జరుపుకోవాలి : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి పాడెకట్టే దినంగా జూన్ నాల్గవ తేదీని ప్రజలు జరుపుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 4వ తేదీన వైసీపీ నేతలు.. 'వెన్నుపోటు దినోత్సవం' కార్యక్రమానికి పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. మహానాడును చూసి.. వైసీపీ నేతలు, మాజీ సీఎం జగన్ రెడ్డి బెంబేలెత్తి పోయారన్నారు. తమ ఉనికిని చాటుకోవడానికే వెన్నుపోటు దినోత్సవం పేరుతో ప్రజలపైన యుద్ధం ప్రకటించారని అన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు వైసీపీని ఇంటికి సాగనంపినా బుద్ధి రాలేదన్నారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

1,300 గ్రాముల గంజాయి స్వాధీనం

తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


పట్టుబడ్డ నిందితుడు, గంజాయిను చూపుతున్న పోలీసులు

గుడిపాల, మే 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దు అయిన గుడిపాల మండలంలోని గొల్లమడుగు వద్ద 1,300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు. ముందస్తు సమాచారంతో గొల్లమడుగు సమీపంలో ఒడిశా రాష్ట్రం బర్ఘాక్ జిల్లాకు చెందిన అశోక్‌దాస్ అనే వ్యక్తి గంజాయిని తీసుకుని చెక్ పోస్టు సమీపంలో ఉండగా గుర్తించారు. వెంటనే తహసీల్దార్ జయంతి, ఆర్ఐ రామసాయి, సిబ్బందితో కలసి అతడిని అదుపులోకి తీసుకుని విచారించామని ఎస్ఐ తెలిపారు. అనంతరం అతడి వద్ద నుంచి 1,300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రెండో పెళ్లి కేసులో భర్తకు ఏడాది జైలు

చిత్తూరు లీగల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లి చేసుకున్న కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష పడింది. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన విజయ కుటుంబ సమస్యల వల్ల తవణంపల్లె మండలం వడ్డిపల్లెలో నివాసం ఉంటోంది. ఈమె బంగారుపాళ్యం మండలం సదకుప్పం గ్రామానికి చెందిన హేమంత్ కుమార్‌ను వివాహం చేసుకుని నాలుగేళ్లు కాపురం చేసింది. హేమంత్ కుమార్ తన భార్య విజయకు తెలియకుండా మరో పెళ్లి చేసుకుని వెళ్లిపోయాడు. దీనిపై విజయ.. 2020 ఆగస్టు 29వ తేదీన బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు హేమంత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక నిందితుడికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ.. న్యాయమూర్తి ఉమాదేవి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ కె.ఉమాదేవి వాదించారు.

కావమ్మ మారయ్య కల్యాణోత్సవం



కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారి పల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లెలో వెలసిన కావమ్మ మారయ్య ఆలయంలో శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తిరుణాళ్ల శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ఆరాధన నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో ముస్తాబైన కల్యాణ మండపంలో కావమ్మ మారయ్య ఉత్సవ విగ్రహాలను ఆశీనులు గావించి, మంగళ వాయిద్యాలు.. అర్చకుల వేద మంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి జంగాలకథ వినిపించారు.

మహానాడుకు వెళ్లిన టీడీపీ కార్యకర్త అదృశ్యం



సుబ్బన్న

రామకుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): కడపలో గురువారం జరిగిన మహానాడు సభకు వెళ్లిన రామకుప్పం మండలం సింగసముద్రానికి చెందిన సుబ్బన్న తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు.. సుబ్బన్న గురువారం తెల్లవారు జామున టీడీపీ కార్యకర్తలతో కలసి మహానాడు సభకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సుబ్బన్న దారితెలియక ఎటో వెళ్లిపోవడంతో సింగసముద్రం నుండి వెళ్లిన సహచర కార్యకర్తలు అతడి కోసం ప్రాంగణంలో చాలా సేపు వెతికారు. గురువారం రాత్రి వరకు వేచిచూసిన ఇతర కార్యకర్తలు అతడి ఆచూకీ తెలియక పోవడంతో చేసేదిలేక వాహనంలో రామకుప్పంకు తిరుగు పయనమయ్యారు. శుక్రవారం సాయంత్రం వరకు అతడు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సుబ్బన్న ఆచూకీ తెలియడం లేదంటూ కుటుంబ సభ్యులు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సుబ్బన్న ఆచూకీ తెలిసిన వారు రామకుప్పం పోలీసులకు తెలియజేయాలన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



రఘును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 30(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలతో నియామక పదవులు పొందిన వారు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి అన్నారు. శుక్రవారం మండల టీడీపీ కార్యాలయంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యులుగా నియమితులైన ముద్దనపల్లెకు చెందిన రఘును మండల పార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, పట్రనారాయణలు సన్మానించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి నేత, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామేగౌడు, నేతలు చిన్నికృష్ణ, సీతాపతి, శ్రీనివాసులురెడ్డి, నరసింహులు, రఫీ, సత్తి, ఆదిల్, విశ్వనాథ్, మనోహర్, జయశంకర్, కామరాజ నాయక్, వెంకటరమణ, అవినాష్, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

చౌడేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు చౌకదుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా డీలర్లు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 నుంచి 8 గంటల వరకు అందుబాటులోనే ఉండాలని ఆదేశించారు. స్థానిక నాయకులతో కలసి పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. పరికిదొనలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సమస్యలపై ఆరా తీశారు. దేవాలయాలు, హోటళ్ల తదితర ప్రాంతాల్లో వివక్షలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

షిఫ్టు ఆపరేటర్ల సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం



సమావేశానికి హాజరైన విద్యుత్ శాఖ యూనియన్ నాయకులు, కార్మికులు

పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ షిఫ్టు ఆపరేటర్ల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అరవ జయమణి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన పలమనేరు విద్యుత్ డివిజన్ కార్మికుల సమావేశంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కొంతమంది కార్మికులకు పీఎఫ్ అమలు చేయడం లేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలమనేరు సబ్‌డివిజన్‌లో 3045 యూనియన్ నుంచి ఏఐటీయూసీలో చేరిన కార్మికులకు డిస్కం ప్రధాన కార్యదర్శి ఆరవ జయమణి అభినందనలు తెలిపారు. పలమనేరు ఏఐటీయూసీ నాయకులు చెన్నకేశవులు, బుర్రమంజునాథ్‌బాబు, పుంగనూరు ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణారెడ్డి, రామ్మూర్తి పాల్గొని ప్రసంగిస్తూ విద్యుత్ శాఖలో షిఫ్టు ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం న్యాయపోరాటాలకు సంపూర్ణమద్దతు ఇస్తామన్నారు. షరీఫ్, కార్తికేయన్, రవీంద్ర, వినాయక, ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమర్‌ను సన్మానించిన చౌకదుకాణ డీలర్లు

పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని స్థానిక చౌకదుకాణ డీలర్లు కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. నిత్యావసర సరుకుల పంపిణీలో మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలను ప్రభుత్వం తొలగించి జూన్ 1నుంచి నిత్యావసర సరుకులను చౌకదుకాణ డీలర్ల ద్వారా పంపిణీ చేసేందుకు నిర్ణయించడం పట్ల వారు అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. డీలర్ల సంఘ నాయకులు నరేంద్రకుమార్, మునిక్రిష్ణయ్య, సనావుల్లా, జుబేర్, జిలాని పాల్గొన్నారు.

కాజూరు బాలాజీకి సత్కారం



కాజూరు బాలాజీతో చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ జన్మదిన సందర్భంగా శుక్రవారం ఆయన ఇంటివెళ్లి శాలువ కప్పి, పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు శేషాద్రి నాయుడు, మోహన్ నాయుడు, నియోజవర్గం టీడీపీ యూత్ ఉపాధ్యక్షుడు నాగిశెటి నాగరాజ, ఐ-టీడీపీ అధ్యక్షుడు హరిబాబు, రఘునాథ్, మదనమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దుకాణంలో చోరీ

పుంగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): దుకాణంలో పట్టపగలే గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని బజార్‌వీధిలోని హరిజెట్టి దుకాణానికి గుర్తు తెలియని దుండగులు ఇద్దరు వెళ్లి భోజనం ఆకులు కావాలని అడిగారు. దుకాణంలో ఆకులు తీసుకువచ్చే లోపు గల్లాపెట్టెలోని రూ.25వేలు డబ్బు తీసుకుని దుండగులు పరారైనట్లు హరిజెట్టి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు - మదనపల్లె మార్గంలోని 150వ మైలురాయి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని హైస్కూల్‌వీధికి చెందిన మునిరెడ్డి కుమారుడు ద్వారకానాథ్‌రెడ్డి(50) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వెళుతూ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో గాయపడ్డాడు. స్థానికులు ఓ ప్రైవేటు వాహనంలో అతడిని పుంగనూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆర్జేడీ ఉత్తర్వులు డిస్మిస్

● హాకింగ్స్ యాజమాన్యం

కుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని హాకింగ్స్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతులకున్న గుర్తింపును రద్దు చేస్తూ కడప ఆర్జేడీ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు డిస్మిస్ చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్డీ.హఫీజ్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హాకింగ్స్ పాఠశాలలో 8, 9, 10 తరగతులకున్న గుర్తింపును రద్దు చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో కేసు వేశామన్నారు. గుర్తింపును రద్దు చేయడానికి గల కారణాలను ఆరు వారాల్లో వివరణ ఇవ్వాలని హైకోర్టు తన డిస్మిస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్నా, లేకపోయినా సీబీఎస్ఈ గుర్తింపుతో ఆయా తరగతులు యథావిధిగా హాకింగ్స్‌లో నడుస్తాయని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ విషయమై ఎటువంటి అపోహలు అక్కరలేదని ఆయన స్పష్టం చేశారు.

అమరనాథరెడ్డిని కలిసిన అమాస



పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన అమాస రాజశేఖరరెడ్డి, సీఈవో శంకరబాబు శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని పలమనేరులో కలిశారు. త్వరలో జరగనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయాలని ఎమ్మెల్యేని అమాస రాజశేఖరరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది గంగిరెడ్డి, యువశేఖర్, హరిప్రసాద్, టీడీపీ పార్లమెంట్ యువత సెక్రటరీ ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యాస జననం

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం భారతంమిట్టలోని ధర్మరాజులు ఆలయం వద్ద మహాభారత యజ్ఞం సందర్భంగా శుక్రవారం పంచ పాండవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకపూజలు, హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భాగవతారిణి నాగరత్న వ్యాస జననం కథను ఆలపించారు. వడ్డిపల్లె, దాసరివారిపల్లె, రాశెట్టివారిపల్లె, గన్నావారిపల్లె, సోమల, చెన్నయ్యగారిపల్లె తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొల్లపల్లెమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని గానుగచింత పంచాయతీ నగిరి దాసరిగూడెంలో జరుగుతున్న గొల్లపల్లెమ్మ జాతరలో భాగంగా శుక్రవారం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆషాధివారికథ, విజయవాడ టీవీ గాయకులు దామోదర గణపతిరావు బృందంచే రేలా, రే రేలా, జానపద గీతాలు, నృత్యాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ జయరామయ్య, ఆలయ నిర్వాహకులు రంగనాథ, వెంకటేశ్వరరావు, కిరణ్, పెద్దరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ప్రజాసమస్యల గురించి ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వివరిస్తున్న తహసీల్దార్ ఇన్బనాథన్

పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం చేయవద్దని పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మార్కెటింగ్ అధికారులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పై అధికారులతో అమరనాథరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. గంటావూరు కాలనీలో గుర్తించిన ఇళ్లస్థలాల అంశంపై వివరాలు తెలుసుకొని, త్వరలో అర్హులైన పేదలను గుర్తించి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మదనపల్లి రోడ్డులో డివైడర్ ఏర్పాటుతో పాటు, గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన విద్యుత్ దీపాల ఏర్పాటుపై కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డిని అడిగి తెలుసుకొన్నారు. విద్యుత్ స్తంభాలతో పాటు మెటీరియల్స్ సిద్ధంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టరు జాప్యంచేస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎస్.హెచ్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే డివైడర్ ఏర్పాటుతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటయ్యేలా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తిచేయాలని అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోనుంచి మార్కెట్ యార్డు వరకు ఇదే పనులు పెండింగ్ ఉన్నాయని, అందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. క్యాటిల్ ఫారం సమీపంలో ఏర్పాటుచేయదలచిన అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పనులపై ఏఎంసీ సెక్రటరీ వి.సంజీవకుమార్‌తో కూడా చర్చించారు. సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘ నేత

పుంగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణలను అధికారులు అరికట్టాలని దళితసంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పుంగమ్మ చెరువు, సుబ్బమ్మ చెరువు, రాయలచెరువులు రోజు రోజుకు కుచించిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలోని కౌండిన్యనది కాల్వలను కొద్దికొద్దిగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. బీజేపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ పట్టణ సమీపంలోని తీగలమ్మ చెరువు ఆక్రమించినట్లు తెలిపారు. మదనపల్లె మార్గంలో ఆర్‌అండ్‌బీకి సంబంధించిన కోట్లు విలువ చేస్తే స్థలం ఆక్రమించినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయాలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ కన్వీనర్ నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీలకు వచ్చే పథకాలను సక్రమంగా అందించాలని కోరారు. తహసీల్దార్ రాము మాట్లాడుతూ ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి వారం ఒక గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత - పూజకోసం కొలువు తీర్చిన కలశాలు

వి.కోట, మే 30 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో ఆర్య వైశ్య సంఘం వారు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో 108 కలశాలను స్థాపించి అమ్మవారి పేరిట విశేష పూజలు చేపట్టారు. గణపతి పూజ, హోమం, ఆదిత్యాది నవగ్రహ పూజ, దుర్గా సప్తపది పారాయణం, అమ్మవారి సహస్ర నామ హోమం జరిపించారు. లఘుపూర్ణాహుతి, మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆర్య వైశ్య ఆలయ కమిటీ భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. 31న శనివారం మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ధర్మకర్త దవనం భక్తా తెలిపారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై దృష్టి సారించాలి



సోమలలో యోగా సాధన చేస్తున్న అధికారులు ప్రజలు

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సోమల తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ సూచించారు. శుక్రవారం సోమల ఎంపీడీవో కార్యాయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగాడేను పురస్కరించుకుని చేపడుతున్న యోగాంధ్ర క్యాంపెయిన్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇంటింటా యోగాంధ్రపై అవగాహన కల్పించాలని, జూన్ 21వ తేదీన చేపడుతున్న యోగా డేను ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, మాస్టర్ ట్రైనీలు కరుణానిధి, చిన్నప్ప, సచివాలయ, అంగన్‌వాడీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి

బైరెడ్డిపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషిచేయాలని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్రబాలాజీ కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంవద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గత రెండురోజులుగా ప్రభుత్వశాఖల సిబ్బందికి జరుగుతున్న యోగా శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాకోసం కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. యోగా మాస్టర్ ట్రైనర్లు బాలాజీ, శాంతి, అమరావతి యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏపీవో హరినాథ్, ఎంసీవో సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, చంద్రశేఖర్, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

పుంగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ స్వామిదాస్ సూచించారు. శుక్రవారం సాయంత్రం పుంగనూరు మండలంలోని రాగానిపల్లె కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూన్ నెలలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సివుందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 15,410 ఇళ్లు మంజూరు చేయగా, 11,142 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇల్లు అవసరమైన లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్, వర్కుఇన్‌స్పెక్టర్ కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బదిలీ, ఇద్దరికి ప్రమోషన్

రొంపిచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో రొంపిచెర్ల మండలంలో ముగ్గురు ప్రధానోపాధ్యాయులు బదిలీ, ఇద్దరు సోషియల్ ఉపాధ్యాయులు పదోన్నతిపై బదిలీ అయినట్లు ఎంఈవో శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హైమావతి కొత్తమంచూరుకు, రొంపిచెర్ల బాలికల పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి పులిచెర్లకు, రొంపిచెర్ల ఉర్దూ హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాష్ కొత్తమంచూరుకు, రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల సోషియల్ ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి అడవిబదుగూరుకు, మంచాల కడపనత్తం పాఠశాలలకు ప్రమోషన్‌లో వెళ్లారన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

● మూలస్థానం అమ్మవారివద్దే తీర్థం బాటిళ్ల విక్రయం



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గత ప్రభుత్వంలో అమ్మవారి పవిత్ర తీర్థం బాటిళ్లను మూలస్థానం అమ్మవారి వద్ద విక్రయిస్తుండగా లడ్డుప్రసాదాల విక్రయ కేంద్రం వద్దకు మార్చి విక్రయించేవారు. భక్తుల సౌకర్యం కోసం గతంలోలాగానే అమ్మ మూలస్థానం ఆలయం వద్దే పవిత్ర తీర్థం బాటిళ్ల విక్రయ కేంద్రాన్ని ఈవో ఏకాంబరం ప్రారంభించారు.

పాఠశాలలకు వచ్చిన పుస్తకాలు, బ్యాగులు

రొంపిచెర్ల మే 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎమ్మార్సీకి నోట్, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు వచ్చినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. 2387 బ్యాగులు వచ్చాయని, వీటిని ఆయా పాఠశాలలకు పంపిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా వసతులు, బోధన అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు.

పౌరహక్కులపై అవగాహన

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం బురుజుపల్లెలో పౌరహక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ బెన్నురాజ్ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు కల్పించిన హక్కులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానికంగా గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. మాజీ సర్పంచు హరిప్రసాద్, ఆర్ఐ సుబుక్తుల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్తలు సైనికుల్లా పని చేయాల్సిన అవసరముందని ఆ పార్టీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చదళ్లలో జనసేన గుర్తింపు కార్డులను కార్యకర్తలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రతి కార్యకర్త గ్రామాల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాల్సి వుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, చైతన్యరాయల్, నరేంద్రరెడ్డి, పాముల హరి, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, కుమార్, నాగరాజనాయక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కందూరు, పెద్దఉప్పరపల్లె, నెల్లిమంద పశువైద్యశాలల్లో 50శాతం రాయితీతో పశుదాణాను పాడి రైతులకు అందజేశారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు నాయుడు, పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు రాయల్, నౌషాద్, బాలకృష్ణమ నాయుడు, సతీశ్, లక్ష్మీపతి నాయుడు, శంకర్, పెద్ద రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు రాయితీపై ఊజీ ఈగల బుట్టలు

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ మామిడిలో ఊజీ ఈగల నివారణ కోసం రాయితీపై ఊజీ ఈగల ఒక బుట్టను, నివారణకు మూడు టాబ్లెట్స్ కలిపి రూ.11లకే అందజేస్తున్నట్లు ఉద్యానాధికారి సంతోషికుమారి తెలిపారు. ఒక ఎకరానికి 8 బుట్టలు చొప్పున గరిష్ఠంగా 40 బుట్టలను రాయితీపై అందజేస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు, వన్‌బీ, జిరాక్స్ అందజేసి బుట్టలు పొందవచ్చునని తెలిపారు. సోమల, చౌడేపల్లె, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన మామిడి రైతులు సోమవారం నుంచి చౌడేపల్లె ఉద్యానశాఖ కార్యాలయం వద్ద పొందవచ్చునని వివరించారు. మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సోమలలో మోస్తరు వర్షం

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శుక్రవారం సాయంత్రం 6గంటల నుంచి పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. టమోటా రైతులు తోటల్లో నీరు నిల్వ ఉండకుండా పొలాల వైపు పరుగులు పెట్టారు. వరి కోతలు చేసిన రైతులు ధాన్యం నిల్వలపై వర్షం పడకుండా ఉండేందుకు అగచాట్లు పడ్డారు. సోమల, కందూరు, నెల్లిమంద, తమ్మినాయనపల్లె, కరకమంద తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించినట్లు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి పదోన్నతిపై యర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వెళ్లారు. మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ ఖలీల్‌బాషా పదోన్నతిపై కలకడ మండలం కోన జడ్పీ ఉన్నత పాఠశాలకు, పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సయ్యద్ సాహేబ్‌వలి పదోన్నతిపై కేవిపల్లి మండలం చిన్నకమ్మిరెడ్డిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వెళ్లారు. కాగా రొంపిచెర్ల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న లక్ష్మీదేవమ్మ బదిలీపై పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు, పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లోకనాథరెడ్డి పదోన్నతిపై కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వచ్చారు. కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మంజువాణి చంద్రగిరి మండలం పనపాకం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు.

అలరించిన దుర్యోధన వధ

సోమల, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట గార్గేయనదీ తీరంలో వెలిసిన గార్గేయలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన మహాభారత యజ్ఞంలో భాగంగా దుర్యోధన వధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం భాగవతారిణి రత్నకుమారి భక్తులకు దుర్యోధన వధ ఘట్టం భక్తులకు వినిపించారు. ఉభయదారులు పాండవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంవద్ద రాయలపేట వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు దుర్యోధనుడు, భీమసేనుడు పాత్రధారుల మధ్య యుద్ధ సన్నివేశం ఆకట్టుకుంది. ధర్మరాజు పట్టాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గుత్తా జయలలితమ్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పలమనేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలమనేరు సీఐటీయూ కార్యాలయంపై యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు గిరిదరగుప్తా, మండల సీఐటీయూ కార్యదర్శి సావిత్రి, ఖైరున్నీసా, ప్రతాప్, రవి పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



ఈ కాలనీలకు మట్టిరోడ్లే దిక్కు

ఇబ్బంది పడుతున్న జనం

చిత్తూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఇప్పటికీ పలుచోట్ల మట్టి రోడ్లే కనిపిస్తున్నాయి. కట్టమంచి కాలనీ నుంచి సాంబయ్య కండ్రిగ వరకు అపార్టుమెంట్లు వెలిశాయి. నిర్మాణాలు జరిగేటప్పుడే పన్నులు, ఇతరత్రా వాటిని నగరపాలక అధికారులు వసూలు చేసుకుంటున్నారు. అవసరమైన రోడ్లు, కాల్వలు, నీటి వసతిని కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. కలెక్టరేట్ వెనుకభాగంలోని రాఘవరెడ్డికాలనీలో పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. కలెక్టరేట్ ఉద్యోగులు, అధికారులు, వ్యాపారులు, పలువురు ప్రజా ప్రతినిధులు ఇక్కడ నివాస ఉంటున్నారు. ఇక్కడా సరైన రోడ్డు వసతి లేదు. వర్షం కురిస్తే బురదలో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కట్టమంచి కాలనీలో..



రాఘవరెడ్డి కాలనీలో..

మొక్కలు పీకేసిన మాజీ జవాన్ కుటుంబీకులు

● మీడియా ఎదుట ఓ రైతు ఆవేదన



పీకేసిన మొక్కలను చూపుతున్న వీరరాఘవులు కుటుంబీకులు

గంగాధరనెల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): తన అనుభవంలో ఉన్న భూమిలో మొక్కలను మాజీ జవాన్ కుటుంబీకులు పీకేశారని మీడియా ఎదుట శుక్రవారం రైతు వీరరాఘవులు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొండేపల్లె దళితవాడకు చెందిన వీరరాఘవులు.. పోలినాయుడుపల్లె నుంచి చింతారెడ్డిపల్లెకు వెళ్లే దారిలోని గుట్టలో భూమిని చదును చేసుకుని కొన్నేళ్లుగా అనుభవిస్తున్నారు. ఇందులో నెల కిందట మామిడి, కొబ్బరి మొక్కలను నాటాడు. ఈ భూమికి పైభాగంలో నెల్లేపల్లె పంచాయతీ ఎస్.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడకు చెందిన మాజీ జవాన్ సామివేలుకు సుమారు ఐదు ఎకరాల భూమికి పట్టా ఇచ్చారని చదును చేసుకున్నాడు. ఈ క్రమంలో కింది భాగంలోని వీరరాఘవులు అనుభవంలో ఉన్న ఏడు గుంటల భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేశాడు. దీనిపై కొన్నిరోజులుగా వీరరాఘవులకు, సామివేలుకు మధ్య తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం సామివేలు కుటుంబీకులు, బంధువులు కలిసి వీరరాఘవులు భూమిలో నాటిన మామిడి మొక్కలు, కొబ్బరి మొక్కలను పీకేసి, రాతికూసాలను ధ్వంసం చేశారు. సమాచారం తెలుసుకున్న వీరరాఘవులు తన కుటుంబీకులతో కలిసి శుక్రవారం భూమి వద్దకెళ్లాడు. జరిగిన అన్యాయంపై గంగాధరనెల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వీరరాఘవులు మీడియాకు వివరించారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. వీరరాఘవులు అనుభవంలోని భూమిలో మొక్కలు పీకేసినట్లు తనకు సమాచారం అందలేదని చెప్పారు. అయితే ఆ భూమి ప్రభుత్వ భూమి అని, కొంతకాలంగా ఆ భూమిపరంగా ఇరువర్గాలవారు తగాదాలు పడుతున్నారని.. ఈ విషయం ఎమ్మెల్యే థామస్ దృష్టికి వెళ్లిందని అన్నారు. వీరరాఘవులుకు అన్యాయం జరిగితే పోలీసు కేసు పెట్టాలని సూచించారు.

యాళి వాహనంపై యోగ నరసింహుడు

● వైభవంగా వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు



సప్పరంపై వరదరాజస్వామి - యాళి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

యాదమరి, మే 30 (ఆంధ్రజ్యోతి): యాదమరి త్రివేణి సంగమంలోని వరదరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం మూలవిరాట్‌కు అలంకారం, అర్చన, కైంకర్యాలు, అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం సప్పరంలో స్వామివారిని ఊరేగించారు. రాత్రి వర్షం తగ్గాక యాళి వాహనంపై వరదరాజస్వామి యోగ నరసింహుడి అలంకరణలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. గ్రామస్తులు మంగళహారతులతో టెంకాయలు సమర్పించారు. భక్తిబృందం భజనలు చేశారు. శనివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి శేషవాహన సేవలు జరగనున్నాయి.

వైభవంగా ధ్వజారోహణం



శ్రీరంగరాజపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి ఆలయ మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి, పాండవుల ఉత్సవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదారులుగా ఎం.భారతి, సుబ్బనాయుడు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, సుబ్రహ్మణ్య నాయుడు, కేశవులు నాయుడు, రమేష్ నాయుడు, అంజనేయులు నాయుడు, కుప్పయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా కాకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాగునీటి వృథాను అరికట్టిన అధికారులు

యాదమరి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై 'తాగునీటి వృథాను అరికట్టలేరా?' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ ఝాన్సీ పయని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజీవ్‌లు కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. లీకేజీని గుర్తించి.. తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు.

లారీ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం



యాదమరి, మే 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై దేవళం వద్ద లారీ ఢీకొనడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. శుక్రవారం ఉదయం చిత్తూరు వైపు నుంచి తమిళనాడు రాష్ట్రానికి సిమెంటు లోడుతో వెళుతున్న లారీ ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో స్తంభం విరిగిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏఈ గుర్రప్ప పరిశీలించి.. ఎక్స్‌కవేటర్ సాయంతో విరిగిన విద్యుత్ స్తంభాన్ని మార్చారు.

పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ ధ్యేయం



పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు అన్నారు. గుడిపాలలో దాతల సహకారంతో అన్న క్యాంటీన్ ద్వారా శుక్రవారం అన్నదానం చేశారు. నాయకులు కిట్టు, హరి, సుబ్రహ్మణ్యం మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్‌డీలర్లు

నింద్ర, మే 30 (ఆంధ్రజ్యోతి):తహసీల్దారు కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి రేషన్ షాపు డీలర్లు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. సీఎంకు, నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్ల సంఘ మండల అధ్యక్షుడు అప్పారావు, డీలర్లు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.69 లక్షలు



బంగారుపాళ్యం, మే 30 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయ హుండీ ఆదాయం రూ.3,69,355 లక్షలు వచ్చినట్లు ఈవో మునిరాజ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో చిత్తూరు దేవదాయ శాఖ అధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. 83 రోజులకు ఆలయ పరకామణి ద్వారా రూ.3,05,253, అన్నదానం ద్వారా రూ.64,102 ఆదాయం వచ్చినట్లు వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో తెలిపారు.

మహానాడు కిట్ అందుకోవడం నా అదృష్టం



శ్రీరంగరాజపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి మహానాడు కిట్‌ను అందుకోవడం తన అదృష్టమని ఎస్ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లెకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.జగదీష్ తెలిపారు. కడపలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఈ కిట్‌ను తనకు చంద్రబాబు అందజేశారని చెప్పారు. పార్టీకి చేసిన కృషి వల్లే తనికీ అవకాశం వచ్చిందన్నారు.

వార్డుల్లో జరిగే పనులు.. మాకే తెలియదు

● నగరి మున్సిపల్ కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

నగరి, మే 30 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో జరిగే పనులు తమకే తెలియడం లేదని నగరి మున్సిపల్ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కౌన్సిల్ హాలులో చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సమావేశం జరిగింది. కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాలతో అజెండాలోని అంశాలకు వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రతి నెలా ఘోషిస్తున్నా.. హానికర రసాయన రంగునీటి సమస్యకు పరిష్కారం లభించడం లేదని చెప్పారు. ఏ ప్రాతిపదికన ఆరు డైయింగ్ యూనిట్లకు అనుమతులు ఇచ్చారో ఒక కాపీ ఇవ్వాలని కౌన్సిలరు బీడీ భాస్కర్ కోరారు. తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ప్లాంట్ మరమ్మతులకు ఎందుకు నిధులు మంజూరు చేయలేక పోతున్నారని కౌన్సిలర్లు దయానిధి, ఇంద్రయ్య ప్రశ్నించారు. డీఈ సమాధానం ఇస్తూ.. ప్లాంటులో ట్యూబర్ సమస్య ఉందని, మరమ్మతులకు రూ.18 లక్షలు ఖర్చు అవుతుందని 15వ ఆర్థిక సంఘం నిధులతో వాటిని చేయడానికి అనుమతులు కావాలంటూ టేబుల్ అజెండా ఉంచారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న కారు

పూతలపట్టు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరవపాటూరు బస్టాప్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి ఆగి ఉంది. ఆ సమయంలో పీలేరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తూ బస్సును ఢీకొట్టింది. దానివెనుకనే వస్తున్న మరోకారు బస్సును ఢీకొన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదాల్లో వాహనాలు ధ్వంసమైనా ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



బంగారుపాళ్యం, మే 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై మొగిలిలోని శ్రీనివుడ్ పార్క్ సమీపంలో ఈనెల 23వ తేదీన వాహనం ఢీకొని ఓ వృద్ధుడు గాయపడిన విషయం తెలిసిందే. ఆ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బ్లాకలర్ లుంగీ, పచ్చ చొక్కా ధరించి ఉన్నాడని, 60-65 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసినవారు బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మామిడి రైతులకు రాయితీపై ఈగ బుట్టలు

ఐరాల, మే 30 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల మామిడి రైతులకు ఈగ బుట్టలను రాయితీపై అందిస్తామని ఉద్యాన అధికారి సాగరిక తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. వర్షాలు ముందుగానే రావడంతో పండు ఈగలు తోటల్లోకి చేరాయన్నారు. వీటివల్ల నష్టాన్ని నివారించడానికి ఒక బుట్టను రూ.11కి ఇస్తామని చెప్పారు. ఎకరాకు 8 బుట్టలు, 2.5 ఎకరాలకు 20 బుట్టలు అందిస్తామన్నారు. అలాగే ప్రతి రైతుకు 40 బుట్టల వరకు ఇస్తామని వివరించారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం,ఆధార్‌కార్డు జిరాక్సు తీసుకుని బంగారుపాళ్యంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న రైతు సేవా కేంద్రంలో తీసుకోవాలన్నారు. సోమవారం నుంచి ఈ బుట్టలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఈటీపీలో స్లడ్జ్ తొలగింపు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నగరి, మే 30 (ఆంధ్ర జ్యోతి): నగరి మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో మ్యానువల్ డైయింగ్ యూనిట్ల వారి కోసం నిర్మించిన ఈటీపీలో స్లడ్జ్ తొలగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ప్లాంటు పనిచేయక రసాయన నీరు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఏర్పడిన సమస్యలు పరిష్కరించడానికి అధికారులు రంగంలోకి దిగారు. తొలుత ప్లాంటు వద్ద పేరుకుపోయిన సుమారు 700 టన్నులు స్లడ్జ్‌ను మిషన్ డైయింగ్ యూనిట్లవారి సహకారంతో తొలగించే ప్రక్రియను చేపట్టారు. నగరి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, నెల్లూరు జిల్లా కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంటు ప్రాసెసింగ్‌కు లారీలతో తరలించారు.

రాజకీయ చరిత్రలో రికార్డు సృష్టించిన 'మహానాడు'

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడు రాజకీయ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందని రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మహానాడు సభకు ఆశించిన సంఖ్యకంటే ఎక్కువగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరై విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. మహానాడు టీడీపీకి, రాష్ట్ర అభివృద్ధికి దిశ, దశ చూపించిందని అన్నారు. పార్టీ మరో 40 ఏళ్ల పటిష్ఠంగా ఉండడానికి లోకేశ్.. సూపర్ సిక్స్‌ను మహానాడులో ఆమోదంపచేసి, నూతన మార్గం చూపారని ప్రశంసించారు. ప్రభుత్వానికి ప్రజలే ప్రాధాన్యం, పార్టీకి కార్యకర్తలే ప్రాధాన్యం అని మహానాడు స్పష్టం చేసిందని చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

యాదమరి, మే 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉచిత అల్లికలు, మగ్గం శిక్షణ తరగతులు 45 రోజులు పూర్తిచేసుకున్న మొదటి బ్యాచ్‌లో 40 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పెద్దపీట వేస్తున్నాయని చెప్పారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, డీపీఎం మధు, ఏపీఎం ఈశ్వరి, వెలుగు సీసీలు వెంకటేష్, లక్ష్మీపతి, మంజుల, మల్లీశ్వరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), మే 30 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్రకుమార్‌వాణి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. దర్శన ఏర్పాట్లను ఆలయ ఏఈవో రవీంద్రబాబు చేశారు.

సంక్షిప్తంగా..

నేడు సీతారామ కల్యాణోత్సవం

గుడిపాల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలోని శ్రీరాముడి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండల ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

అహల్యాబాయి జయంతి

గుడిపాల, మే 30 (ఆంధ్రజ్యోతి): అహల్యాబాయి జయంతి వేడుకలను శుక్రవారం రెప్పాలమానుచేనులో నిర్వహించారు. బీజేపీ జిల్లా నేత చిట్టిబాబు, నాయకులు సోమనాథ గౌడ్, బ్రహ్మానందరెడ్డి, రామభద్ర,శోభన్‌బాబు, రెడ్డిమస్తాన్, చంద్రన్, సుభాష్, గోపి, దేవరాజ్, శేఖర్, జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలో గృహ ప్రవేశం

వెదురుకుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం హౌసింగ్ కాలనీలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఎంపీడీవో పురుషోత్తం, గ్రామ కార్యదర్శి సాయి భవాని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సింధూజ, సంక్షేమ, విద్యా సహాయకులు సుదర్శన్, హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టరు ఆంజనేయులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో గంగజాతర

చిత్తూరు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంత్ నగర్ కాలనీ, ఇరువారంలో జూన్ 3,4 తేదీల్లో నడివీధి గంగజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ముగిసిన యోగాంధ్ర శిక్షణ

వెదురుకుప్పం, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులకు మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఎంపీడీవో ఎల్.పురుషోత్తం మాట్లాడుతూ రోజూ యోగా చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో మోహన్ కుమార్, యోగా శిక్షకులు త్రిలోకసుందరి, దాము పాల్గొన్నారు.

యోగాతో శారీరక ఒత్తిడి నియంత్రణ: యోగాతో శారీరక ఒత్తిడిని నియంత్రించవచ్చని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. పరిపాలనాధికారి విద్యావతి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



విజయపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడు ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు వాసుదేవ వర్మ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయన్ను పలువురు సత్కరించారు. వీరిలో.. ఎంఈవో శ్యామల, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యంనాయుడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రధాన కార్యదర్శులు మణిగండన్, ముత్యాలరెడ్డి, మాజీ సీఐ జయచంద్రరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులున్నారు.

3న సైకిల్ డే

చిత్తూరు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సైకిల్ డేని జూన్ మూడో తేదీన నిర్వహించనున్నట్లు నగర సైకిల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కొంగారెడ్డిపల్లెలో వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రోజూ సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పారు. మూడో తేదీన ఉదయం కొంగారెడ్డిపల్లె ఎన్టీఆర్ వద్ద కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు. రాజ్ కమల్, సునీల్, జయంత్, భరత్, సూరి, నేచర్ మురళి, వినోద్ పాల్గొన్నారు.

నేడు థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వింజం పంచాయతీలో శనివారం ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ పర్యటన ఉంటుందని పీఏ చంద్రశేఖర్ తెలిపారు. వింజం దళితవాడలో ఉదయం తొమ్మిది గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం సిద్దేశ్వరకొండ వెటర్నరీ ఆస్పత్రి వద్ద పాడిరైతులకు పశుదాణా బస్తాలను పంపిణీ చేయనున్నారు.

ఘనంగా కాజూరు బాలాజి జన్మదిన వేడుకలు

చిత్తూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నగరంలోని మురకంబట్టు, దొడ్డిపల్లె, హైరోడ్డు, గిరింపేట, సంతపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి లతోపాటు వృద్ధాశ్రమం, శిశువిహార్ తదితర ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు, అభిమానులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. బాలాజీని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసంలో కలిసి కేకులు కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం గిరింపేట చౌడేశ్వరి ఆలయం నుంచి గాంధీ విగ్రహం వరకు బాలాజి భారీ ర్యాలీగా వెళ్లి.. బాణసంచా కాల్చి, అభిమానుల మధ్య భారీకేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురజాల సందీప్, సీనియర్ నాయకులు చెరుకూరి వసంత్‌కుమార్, తులసి, చిత్తూరు వాకింగ్ స్టార్స్ సభ్యులు మండి సుధ, కార్ బాలాజి, మురళి, శ్రీనివాసమూర్తితో పాటు పలువురు టీడీపీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కాజూరు బాలాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్తూరు వాకింగ్ స్టార్స్ సభ్యులు - గజమాలతో అభిమానుల సత్కారం